క్లుప్తంగా

నేడు కంభంలో సర్వసభ్య సమావేశం

కంభం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరభద్రాచారి తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

7న అర్ధవీడులో..

అర్ధవీడు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 7వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నర్సయ్య తెలిపారు. సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

రేపు మార్కాపురంలో రెవెన్యూ సదస్సు

మార్కాపురం రూరల్: ఈనెల 4వ తేదీన మార్కాపురం రెవెన్యూ కార్యాలయం ఆవరణలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. రెవెన్యూకు సంబంధించిన సమస్యలు ఉన్నట్లయితే అర్జీ రూపంలో తమ దృష్టికి తీసుకురావాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం



సాయం చేస్తున్న అమ్మ ఫౌండేషన్ సభ్యులు

గిద్దలూరు రూరల్: అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బోనేని వెంకటేశ్వర్లుయాదవ్ పట్టణంలోని నల్లబండ బజారులోని నివాసం ఉంటున్న పల్లపాటి జోసఫ్ అనే నిరుపేదకు గురువారం రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. నియోజకవర్గంలోని పేద విద్యార్థులు, దివ్యాంగులు, ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు అమ్మ ఫౌండేషన్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని వెంకటేశ్వర్లు యాదవ్ పేర్కొన్నారు.

విశ్రాంత ఫిజిక్స్ లెక్చరర్ మృతి



నరసింహారావు(ఫైల్)

మార్కాపురం: మార్కాపురం ఎస్‌వీకేపీ కళాశాలలో సుమారు 20 ఏళ్ల పాటు ఫిజిక్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వర్తించిన ఐవీఎస్ఆర్(ఐవీ నరసింహారావు) గురువారం అనారోగ్య కారణాలతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని పలువురు పట్టణ ప్రముఖులు సందర్శించి ఘనంగా నివాళులర్పించారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మోహిద్దీన్

మార్కాపురం టౌన్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని చర్చిలో తడికమల్లె బాలుడు ఆధ్వర్యంలో పలువురు పేదలకు మైనార్టీ సంఘ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ గౌస్ మోహిద్దీన్ దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్.శ్రీను, విజయ్, మహిళలు పాల్గొన్నారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో నివసిస్తున్న వృద్ధులకు సందాసిని ఫౌండేషన్ సహకారంతో నివేదిత రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో డైరెక్టర్ కళావతి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయడంతోపాటు భోజనం అందజేశారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

గిద్దలూరు రూరల్: ఆర్యవైశ్య పేద విద్యార్థులకు ప్రతిభా ఉపకార వేతనం అందించేందుకు ఈ నెల 8 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వాసవీ ఆర్యవైశ్య పేద విద్యార్థుల సేవా సంస్థ నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆర్యవైశ్య విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల కోసం అమ్మవారిశాలలోని నిర్వాహకులను సంప్రదించాలని తెలిపారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు, ఎస్టీయూ నాయకులు

మార్కాపురం టౌన్: ఎస్టీయూ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఎంఈవోలు రాందాస్ నాయక్, శర్వాణి ఆవిష్కరించారు. గురువారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎస్టీయూ ఏపీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తమ హక్కులపై అవగాహనతోపాటు సామాజిక దృక్పథం కలిగి ఉండాలన్నారు. ఎస్ఎస్‌సీ మెటీరియల్‌ను తయారుచేసిన ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.ఎర్రయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఎస్.ప్రసాద్‌రావు, హెచ్ఎం వై.సుబ్బారెడ్డి, డి.రామాంజనేయరెడ్డి, శ్రీదేవి, గోపాల్ నాయక్, జి.వెంకటేశ్వర్లు, వి.నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మినుము రైతుకు మిగిలేది బూడిదే!

- నిండా ముంచిన తుఫాన్లు, అకాల వర్షాలు
- పంటను ఆశించిన బూడిద తెగులు
- ఎకరాకు 90 కేజీల దిగుబడి కూడా గగనమే.
- పెట్టుబడి చేతికొచ్చేది కష్టమేనని ఆందోళన



సీతానాగులవరంలో బూడిద తెగులు సోకిన మినుముపైరు

మార్కాపురం: మార్కాపురం ప్రాంతంలో మినుము సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. నవంబర్‌లో వచ్చిన ఫెంగల్ తుఫాను, బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు, అకాల వర్షాలతో మినుము రైతు దిగుబడి రాక, పెట్టిన పెట్టుబడి సైతం నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడింది.

మార్కాపురం ప్రాంత రైతులు పీబీబీ 104 రకం మినుము సాగుచేశారు. ఎకరాకు సుమారు 3 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఒక్కో రైతు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సేద్యం కోసం 10 వేల రూపాయల వరకు ఖర్చుపెట్టారు. మార్కెట్‌లో క్వింటా మినుము ధర సుమారు 8 వేల రూపాయల వరకు ఉంది. అయితే బూడిద తెగులు సోకి పంట పూర్తిగా నాశనమైపోయింది. దీంతో ఈ ఏడాది మినుము సాగు చేసిన రైతులు పూర్తిగా నష్టపోయారు. ప్రస్తుతం ఎకరాకు 70 నుంచి 90 కిలోల వరకు కూడా దిగుబడి రావడం కష్టమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది బూడిద తెగులు సోకి పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. ఎక్కువగా వర్షాలు కురవడం వల్ల బూడిద తెగులు సోకింది. ఆకులపై బూడిద రూపంలో చిన్న చిన్న మచ్చలు కనపడి పెద్దవై కొమ్మలు, కాయలకు వ్యాప్తి చెందింది. దీంతో రైతులకు ఊహించని రీతిలో నష్టం వచ్చింది.

మినుము సాగు ఇలా..

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
మార్కాపురం	202.75
పెద్దారవీడు	135
తర్లుపాడు	900
కంభం	72.87
కొనకనమిట	3250

అకాల వర్షాలతో నష్టం



ఈ ఏడాది అకాల వర్షాలతో పంట నష్టం వాటిల్లింది. నవంబర్‌లో వచ్చిన తుఫాన్లు, అకాల వర్షాలతో మినుముకు బూడిద తెగులు వచ్చి పంట మొత్తం ఊడ్చుకుపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. మా ఊరిలో మినుము సాగుచేసిన రైతులందరిదీ ఇదే పరిస్థితి. ఎకరాకు 80 నుంచి 90 కిలోలు కూడా రావడం లేదు. ఈ ఏడాది మినుము సాగుతో నష్టమే మిగిలింది.

– ఎస్.శివ, రైతు, సీతానాగులవరం, తర్లుపాడు మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది ప్రభుత్వం మినుము రైతులను ఆదుకోవాలి. పూర్తిగా నష్టపోయాం. రెండెకరాలు సాగు చేస్తే సుమారు రూ.20 వేలు ఖర్చు వచ్చింది. దిగుబడి పరంగా చూస్తే రెండు క్వింటాళ్లు కూడా రావడం కష్టమే. కేవలం బూడిద తెగుళ్ల వల్లే పంట మొత్తం నాశనమైంది. ఈ పరిస్థితుల్లో రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– పి.తిరుపతయ్య, రైతు, గొట్లగట్టు, కొనకనమిట్ల మండలం

ఇలా జరుగుతుందనుకోలేదు



ఈ ఏడాది మినుము ధర బాగా ఉండటంతో సాగు చేశాను. అయితే ఊహించని విధంగా బూడిద తెగులు వచ్చి పంట మొత్తం పోయింది. లేదంటే ఈ పాటికి కనీసం ఎకరాకు 2 క్వింటాలైనా దిగుబడి వచ్చి ఉండేది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– టి ఓబుల్‌రెడ్డి, రైతు, గజ్జలకొండ

కాపాడాల్సిన అధికారులే.. కంచె తొలగించారు!

- పాలకుల మెప్పు కోసం అధికారుల తహతహ
- సీతానాగులవరం గ్రామంలో వింత పోకడ
- గ్రామ సచివాలయం ఆవరణ ఫెన్సింగ్‌పై రాజకీయం



ఫెన్సింగ్‌తో సచివాలయ భవన ప్రాంగణం



ఫెన్సింగ్ తొలగిస్తున్న అధికారులు

తర్లుపాడు: ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడటం అధికారుల బాధ్యత. కానీ తర్లుపాడు మండలంలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం భవనానికి కేటాయించిన స్థలానికి ఫెన్సింగ్ వేసి మొక్కలు నాటి సుందరంగా తయారు చేయడం జీర్ణించుకోలేని కొందరు పెత్తందారులు అధికారుల వైపు గుడ్లురిమి చూశారు. ఫలితం.. సచివాలయ భవన ప్రాంగణానికి ఎంపీడీఓ చేరుకుని దగ్గరుండి మరీ ఫెన్సింగ్ తొలగించారు. ఇదేమని ప్రశ్నించిన గ్రామస్తులను ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయంటూ బెదరగొట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు.. మండలంలోని సీతానాగులవరం గ్రామ పంచాయతీలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయం, ఇతర భవనాలు ఏర్పాటు చేసేందుకు స్థల సేకరణ చేసింది. సర్వే నంబరు 22/3లో ఉన్న గ్రామ కంఠంలో 25 సెంట్లు సచివాలయ భవనానికి, 10 సెంట్ల రైతు సేవా కేంద్రానికి కేటాయించారు. ఈ ప్రాంగణంలో గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం నిర్మించి 2023లో ప్రారంభించారు. సచివాలయ ప్రాంగణంకు ఎటువంటి రక్షణ లేకపోవడంతో కొందరు అక్రమార్కులు ఆ స్థలంపై కన్నువేశారు. దీనికితోడు సచివాలయంలో విలువైన రికార్డులు, కంప్యూటర్లు, రైతు సేవ కేంద్రంలో పనిముట్లు ఉండటంతో భద్రత కోసం పంచాయతీ తీర్మానంతో స్థానిక సర్పంచ్ గత వారం సచివాలయ ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. ఆహ్లాదంగా ఉండేందుకు మొక్కలను నాటారు. దీనిని జీర్ణించుకోలేని కొందరు వ్యక్తులు రహదారిపై ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులకు అర్జీలు ఇచ్చారు. అర్జీ ఇచ్చిందే తడవుగా గురువారం పోలీసులను వెంటబెట్టుకుని వచ్చిన ఎంపీడీఓ సచివాలయ ఫెన్సింగ్‌ను తొలగించారు. ఇదేమని గ్రామస్తులు ప్రశ్నించగా ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన



అధికారులను ప్రశ్నిస్తున్న సర్పంచ్ ఆంజనేయులు

మీరే రక్షణ కంచెను తొలగించడం ఏమిటని సర్పంచ్ నిలదీసినా అధికారులు స్పందించలేదు. ఈ పరిణామంతో గ్రామంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి



ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం కాకుండా సచివాలయ ప్రాంగణం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించా. కొందరు రియల్ ఎస్టేట్ వ్యక్తులు, అభివృద్ధి నిరోధకులు ఫిర్యాదు చేయగానే అధికారులు ఫెన్సింగ్ తొలగించారు. ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అధికారులే దగ్గరుండి మరీ కబ్జాదారులకు అవకాశం కల్పిస్తున్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వ స్థలాన్ని అక్రమార్కుల చెర నుంచి కాపాడాలని కోరుతున్నా.

– టి.ఆంజనేయులు, సర్పంచ్, సీతానాగులవరం(తర్లుపాడు)

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



వివరాలు తెలుపుతున్న ట్రాఫిక్ ఎస్సై అహరోన్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ ఎస్సై అహరోన్ హెచ్చరించారు. ట్రాఫిక్ ఉల్లంఘన చర్యలపై అవగాహన కల్పించేందుకు పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లైసెన్సు లేకుంటే రూ.500, అతి వేగంగా డ్రైవింగ్ చేస్తే రూ.1000చ ర్యాష్ డ్రైవింగ్‌కు రూ.5 వేలు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే రూ.10 వేలు, రేసింగ్‌లో పాల్గొంటే రూ.5 వేలు జరిమానా విధిస్తామని వివరించారు. కొత్త చట్టాల ప్రకారం మైనర్లు వాహనం నడుపుతూ పట్టుబడితే రూ.25 వేల జరిమానా విధిస్తామన్నారు. ట్రాఫిక్ పోలీసులకు వాహనదారులు సహకరించాలని కోరారు. ఆటో డ్రైవర్లు ఇష్టారీతిగా వ్యవహరించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. కొంతమంది డ్రైవర్లు నిబంధనలు పాటించకుండా ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులకు ఎక్కించుకోవడంతోపాటు ఎక్కడ పడితే అక్కడ యూటర్న్ తీసుకుంటున్నారని, వారికి కూడా జరిమానా వేస్తామని హెచ్చరించారు.

సబ్‌కలెక్టర్ నివాసంలో నూతన సంవత్సర వేడుకలు



సబ్‌కలెక్టర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న తహసీల్దార్లు, రెవెన్యూ ఉద్యోగులు

మార్కాపురం: మార్కాపురం సబ్‌కలెక్టర్ నివాసంలో గురువారం నూతన సంవత్సర వేడుకలను రెవిన్యూ సిబ్బంది, వివిధశాఖల అధికారులు ఉత్సాహంగా నిర్వహించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి సంతాప దినాలు ప్రకటించినందున బుధవారం న్యూఇయర్ వేడుకలను నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో గురువారం సబ్‌కలెక్టర్ నివాసంలో జరిగిన వేడుకల్లో మార్కాపురం, కంభం తహసీల్దార్‌లు చిరంజీవి, కిరణ్‌తోపాటు డివిజన్‌లోని వీఆర్‌ఓలు, ఆర్‌ఐలు, తహసీల్దార్లు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. నివాసం ఆవరణలో మొక్కలు నాటారు. శ్రీ లక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, సర్వేయర్ శివశంకర్, పంచాయతీ సెక్రటరీలు, ఎన్‌జీఓ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ బీవీ శ్రీనివాసశాస్త్రి, వి.శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, సీఐ సుబ్బారావు, పట్టణ ఎస్సై డాక్టర్ రాజమోహన్‌రావు శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాల యాజమాన్య కమిటీలకు శిక్షణ



మాట్లాడుతున్న డీవైఈఓ శామ్యూల్‌జాన్

కంభం: పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తే పాఠశాలల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని డీవైఈఓ శామ్యూల్ జాన్ పేర్కొన్నారు. స్థానిక వాసవి విద్యానికేతన్‌లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీలకు, ప్రధానోపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా హక్కు చట్టాలు, విస్తృత సమావేశాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ మాల్యాద్రి, శ్రీనివాసులు, ఆర్పీలు లంకా నరసింహారావు, త్రివిక్రమరావు, మండల సమన్వయకర్త చిన్నిపద్మావతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలి

కొమరోలు: ప్రభుత్వ పాఠశాలలను సమిష్టిగా అభివృద్ధి చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి వెంకటరత్నం తెలిపారు. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి పాఠశాల యాజమాన్య కమిటీ ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరత్నం పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. 4వ తేదీన మండలంలోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, పాఠశాల స్థాయి సమావేశాలను సంబంధిత ప్రధానోపాధ్యాయులు నిర్వహించాలని తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రం అభివృద్ధికి కృషి



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

కొనకనమిట్ల: ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీ అలివేలుమంగ సమేత వెలుగొండ వెంకటేశ్వర స్వామి సన్నిధిలోని శ్రీకృష్ణయాదవ అన్నదాన సేవా సంస్థ కమిటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తానని కమిటీ అధ్యక్షుడు పిన్నిక హరికుమార్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం శ్రీకృష్ణయాదవ అన్నదాన సత్రం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. 2025 మార్చిలో నిర్వహించనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సత్రం మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే ఈ నెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో అన్నదాన కమిటీ సభ్యులు పిన్నిక చక్రపాణి, నంబుల లక్ష్మయ్య, గుమ్మా కాశయ్య, ఎన్.వెంకటేశ్వర్లు, అంకాల వెంకటేశ్వర్లు, పిన్నిక కొండయ్య, ఈర్ల బాలవెంకటేశ్వర్లు, పిన్నిక వెంకటేశ్వర్లు, నంబుల వెంకటేశ్వర్లు, కాశీరాజు, పిన్నిక శివ, పిన్నిక నాగేశ్వరరావు, సంపతి నాగయ్య పాల్గొన్నారు.

పరికరాలు సద్వినియోగం చేసుకోవాలి

రాచర్ల: రైతు సేవా కేంద్రాలకు ఇచ్చిన వివిధ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఈవీ రమణ సూచించారు. మండలంలోని సోమిదేవిపల్లె, అనుమలవీడు, రాచర్ల, గంగంపల్లె, చినగానిపల్లె గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీపై తీసుకున్న పరికరాలు రైతులు వినియోగించుకుంటున్నారా..లేదా అనే విషయంపై గురువారం తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్, రైతులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వెంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం రూరల్: మార్కాపురం పట్టణ శివారులోని గుండ్లకమ్మ నది ఒడ్డు సమీపంలో జంకె రామిరెడ్డి నగర్‌లో ఉన్న శ్రీలక్ష్మి పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పలువురు భక్తులు హాజరై కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అధ్యక్ష కార్యదర్శులు చక్కా మాలకొండ నరసింహారావు, ఊటుకూరి రామకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నాగెళ్లముడుపులో పశుగణన సర్వే



పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ సిబ్బంది

తర్లుపాడు: మండలంలోని నాగెళ్లముడుపు, ఫతేపురంలో పశుసంవర్ధకశాఖ అధికారులు గురువారం పశుగణన సర్వే నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ జీవాలను లెక్కించారు. ఈ సందర్భంగా జీవాల పెంపకందారులతో సమావేశం నిర్వహించారు. శీతాకాలంలో వచ్చే వ్యాధులు నివారణకు యాజమాన్య పద్ధతులను వివరించారు. ఏట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రైతులకు సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి వీఏఏలు దేవేంద్రగౌడ్ వెంకట సుబ్బమ్మ, త్రినాథ్ పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

కందిలో మారుకా మచ్చల పురుగును నివారించాలి



రైతులకు సలహాలిస్తున్న ఏఓ జక్కం మెర్సీ

బేస్తవారిపేట: కంది పంటలో మారుకా మచ్చల పురుగు నివారణకు వేప నూనె 1500 పీపీఎం 5 మి.లీ మందు, ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని ఏఓ జక్కం మెర్సీ సూచించారు. గురువారం ఒందుట్ల గ్రామంలో కంది పంటను ఆమె పరిశీలించారు. ఉద్యానవన విస్తరణాధికారి శేషగిరి మాట్లాడుతూ.. రసం పీల్చు పురుగుల నివారణకు ఫిప్రోనిల్ గుళికలు ఎకరానికి 8 కిలోలు చల్లుకోవాలన్నారు. ఎకరాకు 15 నీలం రంగు, 15 పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఆదిగణేష్, వీఏఏ నవీన్, రైతులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి 'కాసు' ట్రస్టు విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందిస్తున్న కాసు

కొనకనమిట్ల: 'కాసు' చారిటబుల్ ట్రస్టు సేవా సంస్థ తరఫున పొదిలి, కొనకనమిట్ల మండలాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ట్రస్టు చైర్మన్ కాసు వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గొట్లగట్టు పంచాయతీ వెలుగొండ్రాయునిపల్లి బీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయ నిర్మాణానికి కాసు చారిటబుల్ ట్రస్టు తరఫున రూ.1,11,116ను విరాళంగా అందజేశారు. గురువారం బచ్చలకూరపాడు పంచాయతీలో కాసు ఎస్టేట్‌లో వెలుగొండ్రాయునిపల్లి గ్రామస్తులు ట్రస్టు చైర్మన్ కాసు వెంకటేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి సహకారం అందించాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందించిన కాసును గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కాసు మాట్లాడుతూ.. తమ ట్రస్టు తరఫున వెంగళపల్లి ఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం, గొట్లగట్టు కేజీబీవీ పాఠశాలలో దేశభక్తి నాయకుల ఫొటోలు సమకూర్చామన్నారు. మునుముందు మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ట్రస్టు కోఆర్డినేటర్ ఎన్.వెంకటేశ్వర్లు, సభ్యులు పాల్గొన్నారు.